# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-10-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్, భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాలను జాతీయ స్థాయిలో నిర్వహించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు**

2. **భారత్ "మేక్ ఇన్ ఇండియా" ఇప్పుడు మేక్ ఫర్ ది వరల్డ్‌గా మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్" కార్యక్రమంలో ఉద్ఘాటించారు**

3. **తెలంగాణకు చెందిన డి.వైకుంఠం "చేర్యాల్" జానపద చిత్ర కళను ప్రాచుర్యంలోకి తీసుకువచ్చేందుకు విశేషమైన కృషి చేస్తున్నారని ప్రధానమంత్రి తెలిపారు.**

4. **విశాఖపట్నం నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.**

5. **రాష్ట్రంలో ఓడల తయారీ కేంద్రం ఏర్పాటుపై అధ్యయనం చేసేందుకు కేంద్ర బృందం ఈ రోజు బాపట్ల జిల్లా ,పర్చూరులోని చిన్నగంజాంలో పర్యటిస్తోంది**

==========================

సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్, భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాలను జాతీయ స్థాయిలో నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ప్రధానమంత్రి తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ కార్యక్రమం 115వ సంచిక ఈ ఉదయం 11 గంటలకు ఆకాశవాణి ద్వారా ప్రసారమైంది. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి వివిధ అంశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్, భగవాన్ బిర్సా ముండాలు దేశ సమైక్యత కోసం కృషి చేశారని తెలిపారు. వారికి సంబంధించిన ఆలోచనలను, కార్యక్రమాలను హేష్ ట్యాగ్ సర్దార్150 హేష్ ట్యాగ్ బిర్సాముండా150 పేరుతో సామాజిక మాధ్యమాలలో పంచుకోవాలని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ( 30 సెకన్లు)

---

భారత్ మేక్ ఇన్ ఇండియా ఇప్పుడు మేక్ ఫర్ ది వరల్డ్‌గా మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఈ రోజు ప్రసారమైన మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ, స్వయం సమృద్ధంగా మారేందుకు మేక్ ఇన్ ఇండియా దోహదపడుతోందని అన్నారు. స్వావలంబన భారతదేశ ఉత్సవాలు నిర్వహించేలా కొత్త ఆవిష్కరణలు, స్థానిక అంకుర సంస్థల విశేషాలను హేష్ ట్యాగ్ ఆత్మనిర్భర్ ఇన్నోవేషన్ పేరుతో సామాజిక మాధ్యమాలలో పంచుకోవాలని తెలిపారు. పండుగల కొనుగోళ్లలో వోకల్ ఫర్ లోకల్ కు ప్రాధ్యామిస్తూ,

స్వావలంబన భారతదేశ ప్రచారాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు.

---------------------------

దేశంలోని వివిధ ప్రాంతాలలో సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడానికి అనేక మంది కృషి చేస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ రోజు జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ, తెలంగాణకు చెందిన డి.వైకుంఠం చేర్యాల్ జానపద చిత్ర కళను ప్రాచుర్యంలోకి తీసుకువచ్చేందుకు ఆయన విశేషమైన కృషి చేస్తున్నారని తెలిపారు. చేర్యాల్ చిత్రాలను సిద్ధం చేసే విధానం చాలా ప్రత్యేకమైందని ప్రధానమంత్రి తెలియజేస్తూ...

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా జరిగే "జాతీయ ఐక్యతా దినోత్సవం" రోజున 'రన్ ఫర్ యూనిటీ'లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. ఈ రోజు జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ, ఈసారి దీపావళి కారణంగా అక్టోబర్ 29వ తేదీన 'రన్ ఫర్ యూనిటీ' జరుగుతుందని ఇందులో అత్యధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జాతీయ ఐక్యత మంత్రంతో పాటు ఫిట్‌నెస్ మంత్రాన్ని ప్రతిచోటా వ్యాప్తి చేయాలని కోరారు.అలాగే ధన్ తేరస్, దీపావళి, ఛత్ పూజ, గురునానక్ జయంతి పండుగల సందర్భంగా శుభాకాంక్షలను తెలియజేస్తూ, అందరూ పండుగలను పూర్తి ఉత్సాహంతో జరుపుకోవాలని ప్రధానమంత్రి ఆకాంక్షించారు.

---------------------------

డిజిటల్, సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. ఈ రోజు జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి డిజిటల్, సైబర్ మోసాల గురించి ప్రస్తావించారు.. డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వాలతో దర్యాప్తు సంస్థలన్నీ కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ ఏజెన్సీల మధ్య సమన్వయం కోసం జాతీయ సైబర్ సమన్వయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ప్రధానమంత్రి చెబుతూ...,

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో డేటా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఈక్వినెక్స్ సంస్థను కోరారు. అమెరికాలో పర్యటిస్తున్న మంత్రి శాన్ ఫ్రాన్సిస్కోలోని ఈక్వినెక్స్ డేటా సేవల సంస్థ ప్రతినిధులతో ఈ రోజు సమావేశమయ్యారు. రాష్ట్రంలో డేటా సెంటర్ ఏర్పాటుకు గల అనుకూలతలను మంత్రి వారికి వివరించారు. ఎలక్ట్రానిక్స్ పాలసీ విధానంలో పవర్ రాయితీ, స్టాంప్ డ్యూటీ మినహాయింపు వంటి రాయితీలతో పాటు మెరుగైన ప్రోత్సాహకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని మంత్రి ఈ సందర్భంగా వివరించారు.

---------------------------

విశాఖపట్నం నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. విశాఖ విమానాశ్రయంలో ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్ విమాన సర్వీసును కేంద్రమంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు

మాట్లాడుతూ,విశాఖ–విజయవాడ మధ్య ఫ్లైట్ కనెక్టివిటీ పెంచాలని చాలా మంది కోరారని, ప్రజల కోరిక మేరకు ఈ మార్గంలో రెండు సర్వీసులు ప్రారంభించామన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కొత్తగా విమానాశ్రయాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని కేంద్ర మంత్రి చెబుతూ....

---------------------------

రాష్ట్రంలో ఓడల తయారీ కేంద్రం ఏర్పాటుపై అధ్యయనం చేసేందుకు కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖకు సంబందించిన ఉన్నతాధికారుల బృందం బాపట్ల జిల్లా ,పర్చూరులోని చిన్నగంజాంలో ఈ రోజు పర్యటిస్తోంది .ఇందులో భాగంగా కేంద్ర బృంద సభ్యులు పల్లెపాలెం నుంచి మోటిపల్లి వరకు ఆయా ప్రాంతాలలో పర్యటించి క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేస్తున్నారు.

---------------------------

రాష్ట్రంలో భవన నిర్మాణాలు, లేఅవుట్ల ఆన్‌లైన్ అనుమతుల ఇచ్చే రాష్ట్ర అభివృద్ధి అనుమతుల నిర్వహణ వ్యవస్థ– ఏపీడీపీఎంఎస్ పోర్టల్ లో మార్పులు కోసం కొన్ని రోజుల పాటు పోర్టల్ సేవలను నిలిపివేస్తున్నట్లు రాష్ట్ర పట్టణ ప్రణాళికా విభాగం డైరెక్టర్ విద్యుల్లత తెలిపారు. అమెజాన్ వెబ్ సేవలలో ఉన్న సమాచారాన్ని రాష్ట్ర డేటా కేంద్రానికి బదిలీ చేస్తున్నందున వచ్చే నెల 3 వ తేదీ వరకు సేవలు నిలిపివేయనున్నట్లు చెప్పారు. వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చాక భవనాలు, లేఅవుట్లకు సంబంధించి తిరిగి ఆన్‌లైన్‌లో అనుమతులు మంజూరు చేసే ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ప్రజలు, బిల్డర్లు, ఇంజినీర్లు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రైవేటు పారిశ్రామిక పార్కుల విధానాన్ని ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేటు సంస్థల ద్వారా ప్రపంచస్థాయి పారిశ్రామిక పార్కుల అభివృద్ధిని ప్రోత్సహించడం, పెట్టుబడులు తీసుకురావడానికి అనువైన వాతావరణం కల్పించడం, తద్వారా ఉపాధి కల్పన, సెక్టార్లవారీగా పారిశ్రామిక పార్కుల ఏర్పాటును ప్రోత్సహించడం లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. ఐదేళ్లపాటు ఈ విధానం అమల్లో ఉంటుందని తెలిపింది.

=====================